క్లుప్తంగా

జేపీఎస్‌లను బెదిరించడం సరికాదు

మాక్లూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అడిగిన డిమాండ్లను అంగీకరించకుండా, బెదిరింపులకు గురిచేయటం ప్రభుత్వానికి తగదని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దేశెట్టి సాయిరెడ్డి అన్నారు. బోర్గాం (కె)లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయిరెడ్డి మాట్లాడారు. సీఎం ఇచ్చిన హామీనీ నెరవేర్చాలని సమ్మెకు దిగితే విధుల్లో చేరుతారా.. తొలగించమంటారా.. అంటూ హెచ్చరికలు చేయటం నిరంకుశత్వమేనని అన్నారు. ఇప్పటికైన సీఎం మొండి వైఖరి వీడి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను అంగీకరించాలని డిమాండ్ చేశారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్‌లో జెడ్పీటీసీ నిధులు రూ.లక్ష 25వేలతో ఏర్పాటు చేసిని హైమాస్ట్ లైట్లను శనివారం జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పెంటు గంగాధర్, బద్దం నర్సారెడ్డి పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో గంగపుత్ర సంఘం భవన నిర్మాణ పనుల కోసం ఎమ్మెల్సీ కవిత నిధుల నుంచి రూ.10లక్షల మంజూరు చేయడంపై సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు నిధుల కోసం కృషి చేసిన జెడ్పీటీసీ లక్ష్మీ, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డిలను సంఘ ప్రతినిధులు శనివారం సన్మానించారు. నాయకులు నరేష్, సాయిలు, సాయి కుమార్, మల్లేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి పాస్టరేట్ గ్రామ సంఘాలు, నడిపల్లి లోకల్ సంఘంలో శనివారం వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. మెదక్ అధ్యక్ష మండలం రూపొందించిన సిలబస్‌ను మూడు రోజుల పాటు నిర్వహించారు. తరగతులకు హాజరైన చిన్నారులకు భక్తి పాటలు, ఆటలు, పాటలు, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించి, అందరికి బహుమతులు అందించారు. గురువులు స్టీవెన్ కుమార్, దేవదాస్, స్టీవెన్ అనిల్ కుమార్, ఇవంజలిస్ట్ ఆశీర్వాదం, పాస్టరేట్ ఆఫీసర్స్ సంఘంలో పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

నిజామాబాద్‌నాగారం: బహుధాన్య చిట్స్ యాజమాన్యం కుర్ర గంగయ్య 2022లో ఐపీ పెట్టడంతో నిజామాబాద్ బ్రాంచ్ మేనేజర్ ఎస్‌కె సుజాత్‌అలీ కస్టమర్లకు రూ. కోటి 60లక్షల సొంత ఆస్తిని అమ్మి కట్టినట్లు తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బోధన్‌లో బహుధాన్య చిట్స్ మేనేజర్‌గా ఉండి చిట్స్ వేయించిన కస్టమర్ల నుంచి ముఖ్యంగా షేక్ సైఫ్, ఫజల్, వాజితుల నుంచి వేధింపులు, భౌతిక దాడులు ఎదుర్కొంటున్నానని అన్నారు. వీరి నుంచి తనను రక్షించాలన్నారు. అలాగే యాజమాన్యం కుర్ర గంగయ్య, కుర్ర సుజాతల నుంచి తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలన్నారు. ఈమేరకు సీపీకి విన్నవించినట్లు తెలిపారు.

టమాట ఆటో బోల్తా



ఆర్మూర్‌టౌన్: ఆలూర్‌లో వాగు గడ్డ సమీపంలో శనివారం టమాట ఆటో ట్రాలీ బోల్తా కొట్టింది. మిర్దపల్లి నుంచి నిజామాబాద్‌కు ఆటో వెళుతుండగా, ఆలూర్ వాగుగడ్డ సమీపంలో రోడ్డుపై ఇరువైపులా వరి ధాన్యం కుప్పలు ఉండటం వల్ల ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో 50 టమాట పెట్టెలు ధ్వంసమవగా, ఆటో దెబ్బతిన్నది. సుమారు రూ.25వేల నష్టం జరిగిందని ఆటో యజమాని ముత్తోరా విశాల్ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

భీమ్‌గల్: మండలంలోని పల్లికొండ గ్రామంలో ఇటీవల పిడుగు పడి కర్రోళ్ల అనిల్ యాదవ్‌కు చెందిన 48 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో బాధిత కుటుంబానికి శనివారం బీజేపీ నేత ఏలేటీ మల్లికార్జున్ రూ. 30వేల ఆర్థిక సహాయం అందజేశారు. మహిపాల్, మధు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

14 వందల ఎకరాల్లో పంటనష్టం

- మోపాల్ మండలంలో వ్యవసాయ అధికారుల ప్రాథమిక అంచనా
- ప్రభుత్వానికి నివేదిక అందజేత





మోపాల్ మండలంలో అకాల వర్షాలకు నేలకొరిగిన వరి.. నేలరాలిన ధాన్యం.. (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): అకాల వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేశాయి. ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానలతో మండలంలో సుమారు 1430 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. గత 15 రోజులపాటు కురిసిన అకాల వర్షాలకు ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రంగు మారడం, మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నష్టంపై ఇప్పటికే నివేదికను మండల వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

5,500 ఎకరాల్లో వరి సాగు..

మోపాల్ మండలంలో కంజర్, మోపాల్, మంచిప్ప క్లస్టర్లు ఉన్నాయి. రబీలో సుమారు 5,500 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు కురిశాయి. పంట కోతలు పూర్తయిన వారి ధాన్యం తడిసిపోగా, వడగళ్ల వానకు వరి పంట నేలకొరిగి, ధాన్యం రాలిపోయింది. ఏప్రిల్ 20నుంచి మే 10వరకూ జిల్లావ్యాప్తంగా అక్కడక్కడ వడగళ్ల వర్షాలు కురిశాయి. దీంతో మోపాల్ మండలంలోనే 1050 మందికి చెందిన 1430 ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనావేశారు. అత్యధికంగా మంచిప్ప, అమ్రాబాద్, బైరాపూర్, న్యాల్‌కల్, సిర్‌పూర్, కంజర్, బాడ్సి గ్రామాల్లో వరి పంట నేలకొరిగి, ధాన్యం రాలిపోయింది. కాగా కొన్ని గ్రామాల్లో నష్టపోయిన రైతుల వివరాలు సేకరించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వ్యవసాయాధికారులు ఎవరూ తమ పంటపొలాల వైపు రాలేదని, వెంటనే వివరాలు సేకరించాలని కోరుతున్నారు.

పరిహారం కోసం ఎదురుచూపులు..

అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలను మండల వ్యవసాయాధికారితో పాటు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టపోయిన రైతుల నుంచి ఆధార్‌కార్డు, పట్టా పాస్‌బుక్కు, బ్యాంకు ఖాతా బుక్కు జిరాక్సులను తీసుకున్నారు. వాటిని ఆన్‌లైన్‌లో ప్రభుత్వం రూపొందించిన ప్రొఫార్మా ప్రకారం వివరాలు నమోదుచేశారు. ఇంకా కొంత నమోదు చేయాల్సి ఉంది. పంట నష్టం జరిగిన రైతులకు ఎకరానికి రూ.10వేలు పరిహారం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు రైతుల వివరాలను ప్రొఫార్మాలో పొందుపర్చి ప్రభుత్వానికి నివేదించారు. కానీ ఇప్పటివరకూ పరిహారం విడుదల కాకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. ఈవిషయమై మండల వ్యవసాయాధికారి రవీందర్‌ను సంప్రదించగా, పంట నష్టం వివరాలను ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదించామన్నారు. పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. త్వరలోనే విడుదల అవుతుందని తెలిపారు.

ప్రయాణికుల రక్షణ కోసమే ‘మై ఆటో ఇస్ సేఫ్’



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడీ: ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల రక్షణ కోసమే ‘మై ఆటో ఇస్ సేఫ్’ అప్లికేషన్‌ను పోలీస్ శాఖ ఏర్పాటు చేసిందని ఏసీపీ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఆటో డ్రైవర్స్, ఓనర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. 2019 నుంచి రాష్ట్ర పోలీస్‌శాఖ ‘మై ఆటో ఇస్ సేఫ్’ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇప్పుడు నిజామాబాద్ నగరంలో ఈ ప్రోగ్రాంను అమలు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో సుమారు 8వేల ఆటో రిక్షాలు, 500 క్యాబ్‌లు ఉన్నట్లు తెలిపారు. వీటిలో ప్రయాణికులకు మరింత భద్రత కల్పించేందుకు ఈ అప్లికేషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పోలీస్ సిబ్బంది ప్రతి ఆటో డ్రైవర్‌ను సోదర భావంతో చూడాలన్నారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు క్షేమంగా తీసుకువెళ్లాలని తెలిపారు. ఆటో డ్రైవర్ మంచి క్రమశిక్షణతో ఉండాలన్నారు. నేరాల నివారణకు ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు ఆనంద్, వెంకటేష్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఎస్‌హెచ్‌వో విజయబాబు, టౌన్ సీఐ వెంకట్ నారాయణ, ఎస్సైలు పూర్ణేశ్వర్, శ్రావణ్‌కుమార్, సందీప్, ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

ధర్పల్లి మండలంలో..

ధర్పల్లి: మండల కేంద్రంలో ఆటోడ్రైవర్లకు, ఓనర్లకు శనివారం ‘మై ఆటో ఇస్ సేఫ్’ కార్యక్రమంపై సీఐ సైదా అవగాహన కల్పించారు. ఆటోలు నడుపుతున్న ప్రతి ఒక్కరూ ఆటోలకు చెందిన అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని ఆయన సూచించారు. మై ఆటో సేఫ్ స్టిక్కర్ ప్రతి ఆటోకు వేయించుకోవాలని పేర్కొన్నారు. దీంతో ప్రయాణికులు భద్రతగా ప్రయాణం చేస్తారని తెలిపారు. ఈ స్టిక్కర్లను సరైన ధ్రువ పత్రాలను సమర్పించి నిజామాబాద్ ట్రాఫిక్ పీఎస్ నందు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎస్సై వంశీకృష్ణ, ఎంవీఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఉన్నారు.



ధర్పల్లిలో మాట్లాడుతున్న సీఐ సైదా

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలి



సీసీరోడ్డును పరిశీలిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్‌సిటీ: అభివృద్ధి పనులను సకాలంలో, నాణ్యతతో పూర్తిచేయాలని రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సిబ్బందికి సూచించారు. నిజామాబాద్ రూరల్ మండలం ముబారక్‌నగర్‌లో శనివారం ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. ముబారక్‌నగర్ గ్రామంలో సీసీరోడ్లు, బీటీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్, వైకుంఠధామాలకు రూ. 6కోట్ల 54లక్షలు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో కురుమగల్లి, ఇంద్రనగర్, ఎస్సీకాలనీ, వీవీనగర్, బాలాజీనగర్, లక్ష్మీనగర్, లక్ష్మీప్రియనగర్-2 కాలనీలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులు సకాలంలోపూర్తి అయ్యేలా చర్యల తీసుకోవాలని కార్పొరేటర్ యువన అనిల్‌కు సూచించారు. అనంతరం డివిజన్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ నాయకులు మధుకర్‌రావు, గంగాధర్, అంజనేయులు, ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘పూడికతీతకు రూ. 65 లక్షలు’ పై విచారణ

నిజామాబాద్‌నాగారం: సాక్షిలో ఈ నెల 12న ప్రచురితమైన పూడికతీతకు రూ. 65లక్షలు అనే కథనంపై మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా స్పందించారు. పనులకు 27శాతం లెస్‌లో ఒకే కాంట్రాక్టర్‌కు నాలుగు జోన్లు ఏవిధంగా ఇచ్చారో పూర్తిగా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని మున్సిపల్ ఈఈ మురళి మోహన్, ఇతర అధికారులను శనివారం ఆదేశించారు. ఎలాంటి పనులు చేపడుతున్నారో, పూర్తి ఆధారాలతో సమర్పించాలన్నారు. పనులు ప్రారంభించినట్లయితే ఏవిధమైన పనులు చేశారో క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలన చేయాలన్నారు. వారం రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

రోడ్డును ఆక్రమించిన నిర్మాణాలపై..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 6వ డివిజన్‌లో సాయికృపనగర్‌లో ‘రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు’ అనే కథనం సాక్షిలో శనివారం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా సీరియస్‌గా స్పందించారు. టౌన్ ప్లానింగ్ అధికారులను పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. ఎవరెవరు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారో రిపోర్టు ఇవ్వాలన్నారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే సైతం చర్యలు ఉంటాయన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



సిరికొండ: తమ సమస్యల పరిష్కారం కోసం వీవోఏలు చేపట్టిన సమ్మె శనివారంకు సమ్మె 20వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం మండలాధ్యక్షుడు మూన్‌సింగ్, రాంచందర్, లలిత, కవిత, వర్ణలక్ష్మీ, పుష్ప, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మ్యాక్స్ మహాజనసభ



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని మ్యాక్స్ సంఘ భవనంలో శనివారం అధ్యక్షురాలు సాయమ్మ అధ్యక్షతన మ్యాక్స్ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా 2022-23 ఆడిట్ నివేదిక, పరిశీలన, ఆమోదం, 2023-24 వార్షిక ప్రణాళిక ఆమోదం గూర్చి చర్చించారు. మేనేజర్ సమీనాబేగం, ఉపాధ్యక్షురాలు సత్తెమ్మ, కోశాధికారి విజయ, డైరెక్టర్లు గంగు, వనిత పాల్గొన్నారు

కాంగ్రెస్ నాయకుల సంబురాలు





సిరికొండలో టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు.. జక్రాన్‌పల్లిలో..



ఇందల్వాయిలో..

సిరికొండ/జక్రాన్‌పల్లి/ఇందల్వాయి: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు టపాసులు కాల్చారు. అలాగే మిఠాయిలు పంచిపెట్టారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణాలో కూడా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ముబారక్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేష్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. జెడ్పీటీసీ జగన్, నాయకులు మీసాల మధుకర్‌రావు, జెట్టి మొగులయ్య తదితరులు ఉన్నారు.

సమాచారం..

నేడు కవిసమ్మేళనం

నిజామాబాద్‌నాగారం: ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సంస్థ కార్యాలయంలో మాతృ దినోత్సవం సందర్భంగా కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, కళాకారులు, సాహితీఅభిమానులు హాజరుకావాలన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ తండాలో జగదంబా దేవి సేవాలాల్ మహారాజ్ ఆలయం 12వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు సంత్ శేఖర్ మహారాజ్ హాజరై, ప్రవచనాలు చేశారు. సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని, అందరితో కలిసిమెలిసి జీవనం సాగించాలని సూచించారు. ఈసందర్భంగా యజ్ఞం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వర వెంకటలక్ష్మి జాతర

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బాలాజీ వర వెంకటలక్ష్మి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి రథోత్సవం నిర్వహించగా.. శనివారం ఆలయం వద్ద చక్రతీర్థం నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మండలంలోని



తొర్లికొండలో వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి పల్లకీసేవ, ప్రత్యేక పూజలు చేశారు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి గ్రామంలో ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. హంపీ విరూపాక్ష విద్యారణ్య స్వామి చేత అనుగ్రహ భాషణం నిర్వహించారు.

17న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు



ఖలీల్‌వాడి: ఆర్మూర్ పట్టణంలో ఈనెల 17న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా అడ్‌హక్ కమిటీ కో-ఆర్డినేటర్ కోయేడి నర్సింలు తెలిపారు. నగరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొవాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్ కుమార్‌గౌడ్ హాజరవుతున్నారని తెలిపారు. నాయకులు రెంజర్ల సురేష్, రఫీక్ ఖాన్, ప్రతాప్‌రెడ్డి, శంకర్, ఫిరోజ్, నర్సయ్య, అశోక్, లక్ష్మీ యాదవ్, హరీష్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,400	వెండి (కిలో)	78,200
22 క్యారెట్స్	57,535	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	30	50
బెండకాయ	30	60	గాజరుగడ్డ	20	30
బీరకాయ	30	60	పచ్చిమిర్చి	40	60
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బీర్నిసుకాయ	50	70	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	50	70	గోబిపువ్వు	20	40
పాలకూర	60	80	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	50	70
పుదీనా	30	50			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1- కస్టడీ- 1.25,7.25,10.25
ఛత్రపతి(హిందీ)- 4.30
స్క్రీన్-2- సంగీతం స్కూల్-10.40,7.30
విరూపాక్ష-1.35,10.30
ఉగ్రం -4.30
స్క్రీన్-3 - కేరళ స్టోరీ(తెలుగు) - 1.40,7.30
కేరళ స్టోరీ(హిందీ)-4.30,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1- ది కేరళ స్టోరీ(హిందీ)-10.05,1.05, 7.20,10.20
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (ఇంగ్లీష్)- 4.05
స్క్రీన్-2- గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3డ (ఇంగ్లీష్),12.20
కస్టడీ- 6.30,9.40
స్క్రీన్-3- ఛత్రపతి(హిందీ)- 11.00,7.05
కథ వెనుక కథ- 1.45
1871(హిందీ)- 4.25
భువన విజయం- 9.50
స్క్రీన్-4- సంగీతం స్కూల్-10.30,7.50
ఫర్హానా -1.20 -పొన్నియిన్ సెల్వన్-2-4.20
ఉగ్రం-10.40

దేవి	కస్టడీ
నటరాజ్	ఉగ్రం
లలితామహల్	రామబాణం
విజయ్	విరూపాక్ష

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న సాయాగౌడ్

మోపాల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు చేపట్టే ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రపు సాయాగౌడ్ డిమాండ్‌చేశారు. శనివారం మండలంలోని కంజర్, కులాస్‌పూర్, బాడ్సి, తదితర గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం సాయాగౌడ్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కనీసం టెంట్ సౌకర్యం ఏర్పాటు చేయడం లేదన్నారు. తాగునీటి వసతి, పరికరాలు లేవన్నారు. కూలీకి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, ఏడాదిలో 250 రోజులు పని కల్పించాలని డిమాండ్‌చేశారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 15న కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని, విజయవంతం చేయాలని కోరారు. గంగమల్లు, గంగారెడ్డి, చిరంజీవి, సాయిలు, సుమన్, లక్ష్మీ, పోసాని, భాగ్యలక్ష్మి, సువర్ణ, అమృత పాల్గొన్నారు.

‘రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు’



ఖలీల్‌వాడి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాదవ జాతికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని పీసీసీ సంయుక్త కార్యదర్శి బాస వేణుగోపాల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్, కురుమ సంఘం నాయకుడు మహేష్ అన్నారు. శనివారం కాంగ్రెస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇష్టారీతిన మాట్లాడితే ఎవరు సహించరన్నారు. ఈ సమస్యకు ప్రధాన కారణం మంత్రి తలసాని శ్రీనివాస్ అన్నారు. మంత్రి ఇచ్చిన దానికి ప్రతి సమాధానం రేవంత్‌రెడ్డి ఇచ్చారని పేర్కొన్నారు. దీనిని కులానికి అంటగట్టడం సరికాదన్నారు. నేతల మధ్య జరిగిన సమస్యను కులానికి ముడి పెట్టి రాజకీయ రంగు పూస్తున్న ఘనత శ్రీనివాస్‌యాదవ్‌కు దక్కుతుందన్నారు. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలోని యాదవ, కురుమ సంఘం నాయకులు బాసటగా అండగా ఉంటున్నారని చెప్పారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, రాజ నరేంద్ర గౌడ్, ప్రీతం, శోభన్, వినోద్, రాజు పాల్గొన్నారు.